నమస్తే తెలంగాణ
సిద్దిపేట
13 | హైదరాబాద్, గురువారం 22 ఫిబ్రవరి 2024 | SIDDIPET

# ప్రమాద ఘంటికలు





సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో ఎండిపోయిన మొక్కజొన్న చేను



హుస్నాబాద్‌లో ఎండిపోయిన వరిపైరును చూపిస్తున్న రైతు దొంతరబోయిన రాజయ్య

- ఐదారేండ్ల తర్వాత మళ్లీ ఎండుతున్న పంటలు
- ఆందోళనలో ఉమ్మడి మెదక్ జిల్లా రైతులు .. 6.73 లక్షల ఎకరాల్లో వరి సాగు
- బావుల వద్ద మళ్లీ కనిపిస్తున్న క్రేన్లు
- బోర్లు వేయించి అప్పుల పాలవుతున్న రైతులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు..కరెంట్ కోతలతో ఇక్కట్లు

# పంటెండుతోంది..

అన్నదాతకు 'వరి'గోస



సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో ఎండిపోయిన వరిని తింటున్న పశువులు

సిద్దిపేట, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్‌ఎస్ పాలనలో పచ్చని పంటలతో అలరారిన ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రస్తుతం ఎటుచూసినా ఎండిన పంటలు, అడుగంటిన చెరువులు, కుంటలు, బావులు కనిపిస్తున్నాయి. అనధికార విద్యుత్ కోతలు, నీళ్లు లేక పంటలు ఎండిపోతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.కండ్లముందే ఎండిపోతున్న పంటలను చూసి రైతులు కన్నీళ్లు పెడుతున్నారు. దీంతో చాలా మంది రైతులు బోర్లు వేస్తున్నారు. మరికొందరు రైతులు వ్యవసాయ బావుల్లో క్రేన్‌లా ద్వారా పూడికతీత పనులు మొదలు పెట్టారు. ఏడేనిమిది ఏండ్ల తర్వాత పంట చేలు ఎండిపోవడం చూస్తున్నామని, మళ్లీ పాత రోజులు వస్తున్నాయని రైతులు బాధను వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఐదారేండ్లుగా ఎండాకాలం రాకముందే కాళేశ్వర జలాలతో చెరువులు, కుంటలు, వాగులు నింపడంతో సాగునీటి లేకుండే అని సిద్దిపేట జిల్లా రైతులు పేర్కొంటున్నారు. బీఆర్‌ఎస్ సర్కారు ఉన్నన్ని రోజులు యాసంగిలో గుంట ఎండిపోకుండా పంటలను కాపాడిందని గుర్తుచేసుకుంటున్నారు. ఈ యాసంగిలో సిద్దిపేట జిల్లాలో 3,30,000 ఎకరాలు, మెదక్ జిల్లాలో 2,60,000 ఎకరాలు, సంగారెడ్డి జిల్లాలో 83,000 ఎకరాల్లో రైతులు వరి వేశారు. గతేడాదితో పోలిస్తే ఈ యాసంగిలో వరి సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ పంట చేతికి అందే పరిస్థితి లేకుండా పోయింది. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. ఎండిన పంట చేలల్లో పశువులను మేపుతున్నారు. అక్కన్నపేట, హుస్నాబాద్ మండలంలో చాలా గ్రామాల్లో రైతులు తమ పంట చేలు ఎండిపోవడంతో కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. పరిస్థితి తీవ్రంగా ఉంది.



మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలాపూర్‌లో ఎండిన వరి పొలం వద్ద రైతు

## మెదక్ జిల్లాలో క్షీణిస్తున్న భూగర్భ జలాలు


మెదక్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో అప్పుడే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. నీటికోసం ఇబ్బందులు తప్పేలా కనిపించడం లేదు. ఫిబ్రవరి నెలాఖరులోనే భూగర్భ జలాలు అడుగంటాయి. ఇంకా పూర్తిస్థాయిలో ఎండలు పెరిగితే నీటి కటకట తీవ్రంగా ఉండే ప్రమాదం కనిపిస్తోంది. తాగునీటి సమస్య లేకుండా ప్రభుత్వాలు ముందస్తు చర్యలు ఏమైనా తీసుకుంటాయా అని జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు. మెదక్ జిల్లాలో యాసంగి సీజన్‌లో 2,72,465 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో 2,60,933 ఎకరాల్లో వరి సాగైంది. యాసంగి సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచింది. మరోరెండు నెలలు పంటలను కాపాడాల్సి ఉంటుంది. కానీ, ఇప్పుడు బోరు బావుల్లో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. దీంతో పంటలు ఎండిపోతాయనే సందేహంలో రైతులు ఉన్నారు. దీనికి తోడు విద్యుత్ 18 గంటలు మాత్రమే సరఫరా అవుతోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటల కరెంట్ సరఫరా అయ్యేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇలా అన్ని కారణాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

### జిల్లాలో క్షీణిస్తున్న భూగర్భ జలాలు

జిల్లాలో ఫిబ్రవరిలోనే భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతోంది. రోజురోజుకూ తగ్గుతున్న భూగర్భ జలాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. పల్లెల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. జిల్లాలోని 57 బావుల్లో భూగర్భ జలాల నీటి మట్టాలను సంబంధిత శాఖ అధికారులు పరిశీలించారు. 2023 జనవరిలో సగటు నీటిమట్టం 10.46, 2024 జనవరిలో సగటు నీటి మట్టం 11.46గా నమోదైంది. గత ఏడాది.. ఈ ఏడాదిని పోల్చుకుని చూస్తే నీటి మట్టం 1.0 మీటర్లు మైనస్‌లోకి వెళ్లింది. 2023 ఫిబ్రవరిలో జిల్లా భూగర్భ జలమట్టం 12.16 మీటర్లు కాగా, 2022 ఫిబ్రవరిలో 9.69 మీటర్లుగా నమోదైంది. భూగర్భ జలాలు 2.47 మీటర్లు మైనస్‌లోకి వెళ్లాయి. 2023 ఫిబ్రవరి, 2024తో మండలాల వారీగా సగటు భూగర్భ జలాల స్థాయిలతో పోల్చితే జిల్లాలోని ఆయా మండలాల్లో సగటు నీటి మట్టాలు పడిపోయాయి.

### యాసంగిలో జోరుగా వరిసాగు

మెదక్ జిల్లాలో రైతులు యాసంగిలో వరి పంట జోరుగా సాగుచేశారు. మొత్తంగా 2,72,465 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, అందులో 2,60,933 ఎకరాల్లో వరి సాగు చేశారు. మొక్కజొన్న 2490 ఎకరాలు, జొన్న 7899 ఎకరాలు, శనగలు 271, వేరుశనగ 99, మినుములు 11, ఇతర పంటలు 762 ఎకరాల్లో సాగు చేయగా అప్పుడే వరి పంటలు ఎండిపోతున్నాయి.



హుస్నాబాద్‌టౌన్: ఎండిపోయిన మొక్కజొన్న చేనులో మేస్తున్న గొర్లు

## కరెంట్ కోతలు.. రైతుల ఇక్కట్లు

సంగారెడ్డి, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో అనధికారిక కరెంట్ కోతలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఓవైపు భూగర్భజల మట్టాలు తగ్గుముఖం పడుతుండగా మరోవైపు కరెంట్ కోతల కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.సంగారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్‌లో మొత్తం 1,67,120 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. 82,320 ఎకరాల్లో వరి పంట, 54450 ఎకరాల్లో జొన్న, 18,394 ఎకరాల్లో శనగ, 3524 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 5180 ఎకరాల్లో మొక్కజొన్న, 1075 ఎకరాల్లో చెరుకు, ఇతర పంటలు సాగు చేశారు. యాసంగి సీజన్‌లో అత్యధిక విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు. జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు, నల్లవాగు ప్రాజెక్టుల దిగువన, చెరువులు, కుంటల కింద 40వేల ఎకరాలు, బోరుబావుల కింద మరో 40వేల ఎకరాలకుపైగా రైతులు వరి సాగు చేశారు. నల్లవాగు ప్రాజెక్టు కాల్వల మరమ్మతు పనులు కొనసాగుతుండటంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడంలేదు. సింగూరు ప్రాజెక్టు కింద పుల్కల్, చౌటకూరు, అందోల్ మండలాల్లో రైతులు వరి సాగుచేశారు. జిల్లాలో భూగర్భజల మట్టాలు క్రమంగా తగ్గుముఖం పడుతుండగా బోరుబావుల కింద వరి, ఇతర పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సాధారణ భూగర్భజలమట్టాలు గత ఏడాది డిసెంబర్‌లో 8.68 మీటర్లలోతులో ఉండగా ఈ సంవత్సరం జనవరిలో 9.71 మీటర్లకు పడిపోయాయి. జిల్లాలో మొత్తంగా 1.03 మీటర్లు భూగర్భజలాలు పడిపోయాయి. రోజూ సాయంత్రం 6.15 నుంచి రాత్రి 10 గంటల వరకు అనధికారికంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు.

### వానలు సరిగ్గా పడలేదు

రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఎకరం మక్క, ఎకరం వరిపొలం సాగుచేశా. ఇరువై గుంటల మక్క, ఇరువై గుంటల వరిపొలం ఎండిపోయింది. ఏదీ సక్కగ పారుతలేదు. ఎన్నడూ కాలం గిట్ల కాలే. ఈ సంవత్సరమే ఇట్ల అయ్యింది. నిరుడు, ముందటేడు కాలం బాగైంది. బాయిల నీళ్లు గంటకంటే ఎక్కువ కూడా పారుతలేవు. పదిరోజుల నుంచి మొత్తానికే నీళ్లు ఎల్లుతలేవు.. వరి పొలంలో ఇక ఆవులను మేపుతున్నాం. ఇంకో పదిహేనురోజుల వరకు పంట చేతికి వస్తుండే. పదేండ్ల నుంచి ఎవుసం చేస్తున్నా. చానా ఏండ్ల నుంచి కాలం మంచిగైంది. కానీ ఇప్పుడు వానలు సరిగ్గా పడలేదు. రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టా. మస్తు ఆశలు ఉండే కానీ మునుగుడైంది. ఎవుసం దెబ్బతిని అసలుకే మోసం అయ్యింది.

– దొంతర బోయిన రాజయ్య, రైతు, హుస్నాబాద్ టౌన్

### ప్రభుత్వమే ఆదుకోవాలే..



నాలుగు ఎకరాల పైన వ్యవసాయ భూమి ఉంది. మూడు ఎకరాల్లో మక్క, ఎకరంన్నర వరి పొలం సాగు చేశా. పొలానికి నీళ్లు సరిపోవడం లేదు. కాలం సరిగ్గా కాలే. వానలు లేక బాయిలో నీళ్లు ఎల్లుతలేవు. రెండు మూడు గంటలు పోయగానే మోటర్ బంద్ అయితుంది. రెండులక్షల వరకు పెట్టుబడి పెట్టాం. ఏదో ఇంతచేసుకొని బతుకు దామనుకుంటే దేవుడు గిట్ల చేసిండు. పెట్టుబడి అంతా మునుగుడు అయితుంది. చుట్టాల దగ్గర అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాం. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– చెన్నవేని పద్మ, రైతు, హుస్నాబాద్ టౌన్

### తడులమీద పారుతున్నది



మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగచేస్తే ఎకరంన్నరనే వరుస తడుల మీద పారుతున్నది. రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టా. కర్రగాకపోతే తలపువ్వుకు వచ్చిన సేను పోయింది. ఏం లాభంలేదు. రైతు బంధు కూడా రాలేదు. గొర్రెపిల్లలను (జీవాలను) అమ్మితే రూ.80వేలదాకా వచ్చాయి. ఈ సంవత్సరం మొత్తం మునుగుడే. ఇద్దరం బతుకుడు కట్టమైంది. తొమ్మిదేండ్ల నుంచి కరువు చూడలే. కైకిలు సేత్తనిండుతదా... సోడు పండితే నిండుతది. మూలమడిపారితే కొన్నిరోజులు తింటాం.

– గొర్ల అయిలయ్య, హుస్నాబాద్ టౌన్

# సబ్ స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం



- ముస్తాబాద్ చౌరస్తా వద్ద గల 220 కేవీ సబ్ స్టేషన్‌లో చెలరేగిన మంటలు
- గంటలపాటు అంధకారంలో సిద్దిపేట, దుబ్బాక
- దగ్గరుండి పరిస్థితిని సమీక్షించిన ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి

ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఉన్న 220 కేవీ సబ్ స్టేషన్‌లో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సిద్దిపేట, ఫిబ్రవరి 21: సిద్దిపేట, దుబ్బాక పట్టణాలు బుధవారం రాత్రి నుంచి గంటలపాటు అంధకారంలోకి వెళ్లాయి. సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఉన్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి 7గంటల ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఈ ప్రమాదంతో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లు పేలడంతో పెద్ద ఎత్తున మంటలు రేగాయి. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రమాదంలో కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిసింది. విద్యుత్ ట్రిప్ కావడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం విషయం తెలియగానే సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంటలు అదుపులోకి తెచ్చేందుకు విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్, ఫైర్ అధికారులకు పలు సూచనలు చేశారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ నుంచి నాలుగు అగ్నిమాపక యంత్రాలను తెప్పించి రాత్రి వరకు మంటలను అదుపులోకి తెచ్చారు. రాత్రి వరకు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి ఘటనా స్థలంలోనే ఉండి పరిస్థితిని సమీక్షించారు. ఘటనా స్థలం నుంచే విద్యుత్‌శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్కతో హరీశ్‌రావు ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి వివరించారు. మంటలు అదుపులోకి రావడంతో విద్యుత్ అధికారులు రాత్రి 10.45 గంటలకు కరెంట్‌ను పునరుద్ధరించారు.



ప్రమాదస్థలానికి చేరుకుని అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తదితరులు

# హాఫ్ మారథాన్‌ను విజయవంతం చేయండి

హుస్నాబాద్, ఫిబ్రవరి 21: హుస్నాబాద్ పట్టణంలో మార్చి 10న నిర్వహించే హాఫ్ మారథాన్ (21కి.మీటర్ల పరుగుపందెం)ను విజయవంతం చేయాలని సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ అనురాధ కోరారు. బుధవారం సిద్దిపేట కమిషనరేట్‌లో హాఫ్ మారథాన్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుస్నాబాద్‌లో నాల్గోసారి హాఫ్ మారథాన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్, హుస్నాబాద్ పోలీసులు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు పట్టణంలోని అక్కన్నపేట రోడ్డులో జరుగుతాయన్నారు. 21కే రన్(హాఫ్ మారథాన్), 10కే రన్, 5కే రన్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన రన్నర్స్ ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. హుస్నాబాద్‌తో పాటు ఇతర జిల్లాల యువతీయువకులు, రన్నింగ్‌లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో హుస్నాబాద్ రన్నర్స్ అ సోసియేషన్ అధ్యక్షుడు ఆకుల వెంకట్, కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షుడు సంపత్, శ్రీనివాస్, కత్తుల బాపురెడ్డి, సీఐ సత్యనారాయణ రెడ్డి, పరంధాములు, రాజు పాల్గొన్నారు.



సిద్దిపేట కమిషనరేట్‌లో హాఫ్ మారథాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ అనురాధ



కాంగ్రెస్‌లో చేరుతున్న నలుగురు రామాయంపేట బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

## బీఆర్‌ఎస్‌ను వీడిన నలుగురు కౌన్సిలర్లు

రామాయంపేట, ఫిబ్రవరి 21: మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు స్వగృహంలో ఆయన సమక్షంలో రామాయంపేటకు చెందిన కౌన్సిలర్లు దేమె యాదగిరి(6వ వార్డు), చిలుక గంగాధర్ (11వ వార్డు), దేవుని జయరాజు (9వ వార్డు), సుందర్‌సింగ్ (2వ వార్డు) కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారితోపాటు చిన్నశంకరంపేట మండలం శేరిపల్లి మాజీ సర్పంచ్ కృష్ణాగౌడ్ చేరారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, మాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి, రాంచందర్‌గౌడ్, పిట్ల ప్రకాశ్, మేడి గణేశ్ తదితరులు ఉన్నారు.

# భవిష్యత్ అంతా కంప్యూటర్‌దే..

- నేడు కంప్యూటర్ పరిజ్ఞానం జీవన విధానంలో ఓ భాగం
- కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే రీతిలో సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల
- ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



సిద్దిపేటలో ప్రారంభించిన ల్యాబ్‌లో కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థులు, పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఫిబ్రవరి 21: భవిష్యత్ అంతా కంప్యూటర్‌దేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాలను కార్పొరేట్‌కు తలదన్నే రీతిలో అభివృద్ధి చేశామన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ బాలికల పాఠశాలలో పెచ్చులూడుతూ ఉండేదని, దీంతో విద్యార్థులు భయపడుతూ చదువు కొనసాగించారన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాలను తీర్చిదిద్దామన్నారు. విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. త్వరలోనే మంచి కంప్యూటర్ బోధకులను పాఠశాలలో ఏర్పాటు చేయిస్తామన్నారు. ఇక భవిష్యత్ మొత్తం కంప్యూటర్ దే అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు మించిన విధంగా డిజిటల్ ప్యానల్స్‌తో కంప్యూటర్ ల్యాబ్‌ను అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేయించామన్నారు. టెన్త్ పరీక్షలో పాఠశాల విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రతి ఒక్కరూ రెండు నెలలు కష్టపడి చదువుకోలన్నారు. నేడు కంప్యూటర్ పరిజ్ఞానం జీవన విధానంలో భాగమైందన్నారు. జిల్లాలో ఎక్కువ మంది ఆడపిల్లలు చదివే పాఠశాల ఇదని, ఈసారి టెన్త్‌లో వందశాతం ఫలితాలు సాధించాలన్నారు. మీరు బాగా చదువుకోండి భవిష్యత్ మీచేతిలోనే ఉందన్నారు. మీరు నాకు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ పదిలో 100 శాతం మార్కులు సాధించడమేనన్నారు. సిద్దిపేట నియోజకవర్గం టెన్త్‌లో ప్రథమ స్థానంలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ పూర్ణిమా ఎల్లం, ప్రిన్సిపాల్ మనోహర్, ఎంఈవో యాదవరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జీతాలూ మహాప్రభో



- కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు నిలిచిన వేతనాలు
- రెండు నెలలుగా ఎదురుచూపులు
- కుటుంబాల పోషణకు కష్టాలు
- ఇచ్చిన హామీ నిలుపుకోవాలంటున్న అంగన్‌వాడీలు

కరీంనగర్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కలెక్టరేట్: 'ఓడెక్కె దాకా ఓడ మల్లన్న.. ఓడ దిగినంక బోడి మల్లన్న' అన్నట్టుగా ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. శాసన సభ ఎన్నికలకు ముందు ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించిన ఆ పార్టీ, ఇప్పుడు అమలులో మాత్రం చోద్యం చూస్తున్నది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో కలిపి ఏ నెలకు ఆ నెల జీతాలు విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చినా.. తీరా గెలిచిన తర్వాత జీతాలు పెంచడం దేవుడెరుగు? ఉన్న జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. ఫలితంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది.

### నాడు ఆదుకున్న కేసీఆర్ సర్కారు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ ఆరేండ్లలోపు బాలల కు ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్నారు అంగన్‌వాడీలు. అలాగే, ప్రభుత్వం నిర్వహించే పలు సర్వేలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు కూడా చేస్తుంటారు. అయినా నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. వేతనాలు పెంచాలని అనేక ఆందోళనలు చేసినప్పుడల్లా కంటితుడుపుగా రూ.వందో రూ.200లో పెంచేవారు. అవి ఏ మూలకూ సరిపోక ఇబ్బంది పడేవారు. కానీ, కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత ఆ పరిస్థితి మారింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించే కీలకమైన సేవల్లో ఉన్న అంగన్‌వాడీలకు సముచిత స్థానం కల్పించింది. కేంద్రంతో నిమిత్తం లేకుండా చిరుద్యోగుల సంక్షేమాన్ని చూసుకున్నది. తెలంగాణ వచ్చినప్పుడు అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ. 3,200, హెల్పర్లకు ఇంకా తక్కువ వేతనం ఉండగా, రాష్ట్రం వచ్చిన వెంటనే వీరికి వేతనాలు పెంచింది. టీచర్లకు నెలకు రూ.13,650, హెల్పర్లకు రూ.7,800 వేతనం అందించింది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంతగా వేతనాలు పెంచలేదు. ఆ తర్వాత ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్నట్లుగా రెండు సార్లు పీఆర్సీ అమలు చేసింది. అయితే కరోనా విపత్కర కాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా.. సంక్షేమాన్ని మాత్రం ఆపలేదు. ఉద్యోగులకు అటో ఇటో వేతనాలు కాస్త ఆలస్యమయ్యాయి కానీ, ఏనెల కూడా వేతనాలు ఆపలేదు.

### నేడు జీతాల కోసం ఎదురుచూపు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 75 రోజులు గడిచింది. కానీ, ఇప్పటికీ వరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు జీతాలు విడుదల చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదా పు 35వేల సెంటర్లలో పని చేస్తున్న 65 వేల అంగన్‌వాడీలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు 1475, ఆయాలు 1255, మెదక్ జిల్లాలో 1076 మంది అంగన్‌వాడీ టీచర్లు, 1076 మంది ఆయాలు ఉన్నారు. జీతాలు పెంచడమేమో గానీ, ఉన్న జీతాలు సక్రమంగా పంపిణీ చేయడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ ఏరు దాటినంక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్నదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. జీతాలు లేక తమ కుటుంబాల పరిస్థితి కడుదయనీయంగా మారతున్నదని, అప్పులు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎదుర్కొంటున్న పరిస్థితులపై కాంగ్రెస్ నాయకుల ఎదుట గోడు వెళ్లబోసుకుందామంటే, కనీసం వారిని కలిసే సమయం కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు.